

ఉన్నత ప్రమాణాలతో విద్య

ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్య అందించడమే తమ సంస్థ లక్ష్యమని డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 24,357 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 45,107 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,279 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,791 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.50 అడుగులు
ఇన్‌ఫ్లో	: 642.50 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 624.52 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 259.38 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 306.54 క్యూసెక్కులు
సీపేజ్, లీకేజ్ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టి అభిషేకం, అర్చన చేశారు.అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. అదే విధంగా యాదాద్రి కొండపై ప్రధానాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు



మెడల్స్ సాధించిన మోత్కూరు విద్యార్థులు

మోత్కూరు : జిల్లా కేంద్రంలో టైగర్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మోత్కూరు విద్యార్థులు సత్తా చాటారు.స్టాండర్డ్ షిటోరియో ఇంటర్నేషనల్ కరాటేకు చెందిన 17 మంది విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు.
బ్లాక్ బెల్ట్ విభాగం : ఎస్.చైతన్ గోల్డ్, డి.అశ్విత్ సిల్వర్, ఎస్.చరణ్ బ్రాంజ్ మెడల్ సాధించారు.
బ్రౌన్ బెల్ట్ కటా: ఎం.సిరివెన్నెల సిల్వర్, బి.రేణుశ్రీ, ఎం.సాయికుమార్, బి.శ్రీమాన్, జె.శివకుమార్ బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు.
బ్లూ బెల్ట్ : వి.అస్మిత సిల్వర్, వి.హాసిని ఎం.అద్వైత, ఎస్.వైష్ణవి బ్రాంజ్ మెడల్స్
గ్రీన్ బెల్ట్: ఎం.విమలశ్రీ సిల్వర్, సీహెచ్ వీణ బ్రాంజ్, ఆర్.యశస్వి బ్రాంజ్ మెడల్స్
పర్పుల్ బెల్ట్: ఎండీ .ఇషాన్, ఎస్.చక్రవర్ధన్ గౌడ్ మనుతేజ్, పి.సంజయ్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విద్యార్థులను కరాటే గ్రాండ్ మాస్టర్ బాలరాజు అభినందించారు.

గుజరాత్ శిక్షణలో జెడ్పీ సీఈఓ



కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ జాయింట్ కార్యదర్శిని సత్కరిస్తున్న శోభారాణి

భూదాన్‌పోచంపల్లి, భువనగిరి టౌన్ : గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాలో దేశవ్యాప్తంగా ఉన్న జెడ్పీ సీఈఓలు, జెడ్పీటీసీలకు ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శిక్షణ తరగతుల్లో యాదాద్రి జెడ్పీ సీఈఓ శోభారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి వికాస్‌రాజ్ ఆనంద్, ఆనంద్ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌చౌదరిని పోచంపల్లి శాలువాలతో సత్కరించి, యాదాద్రీశుడి లడ్డూ ప్రసాదం అందజేశారు. మంత్రి పోచంపల్లి చేనేత శాలువా నాణ్యతను చూసి నేత కార్మికుల పనితీరును ప్రశంసించారు. సమర్థవంతమైన పంచాయతీ పాలన, కమ్యూనిటీ నాయకుల నాయకత్వం, నిర్వాహక నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

కనీస వేతనం రూ.24 వేలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

పెద్దవూర : పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు కనీసవేతనం రూ.24 వేలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్రల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా పెద్దవూరలో నిర్వహించిన గోపాలమిత్రల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నా రూ.8500 వేతనమే అందజేస్తున్నారని పేర్కొన్నారు. పశు వైద్యశాఖలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో సీనియారిటీ ప్రాతిపదికన గోపాలమిత్రలకు అవకాశం కల్పించాలని, వెటర్నరీ అసిస్టెంట్ పరీక్షల్లో అర్హత కలిగిన గోపాలమిత్రలకు 30 శాతం వెయిటేజీ కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో చనిపోయిన గోపాలమిత్రల కుటుంబాలకు ప్రమాదబీమా రూ.6 లక్షలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ప్రజారోగ్యానికి పెనుముప్పు!

హైవే వెంట విచ్చలవిడిగా వ్యర్థ రసాయనాలు పారబోత



తుప్రాన్‌పేట పరిధిలో జాతీయ రహదారి పక్కన పారబోసిన వ్యర్థ రసాయనాలు

- రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా ట్యాంకర్ల ద్వారా తరలింపు
- ఎండిపోతున్న చెట్లు
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు, పీసీబీ అధికారులు



అంకిరెడ్డిగూడెం స్టేజీ సమీపంలో ఎండిపోయిన వృక్షాలు

చౌటుప్పల్ రూరల్ : పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ రసాయనాలు కొంతమందికి కాసులు కురిపిస్తుండగా.. ప్రజారోగ్యానికి మాత్రం పెనుముప్పుగా మారింది. వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు తరలించి శుద్ధి చేయాల్సి ఉండగా.. కొన్ని కంపెనీలు ట్యాంకర్ల ద్వారా తరలించి నిర్జన ప్రదేశాల్లో వదులుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో తీసుకువచ్చి జాతీయ రహదారి పక్కన, వ్యవసాయ భూముల్లో డంప్ చేస్తున్నాయి. ఫలితంగా రసాయనాల గాడతకు రోడ్ల వెంట నాటిన చెట్లు భగ్గున మాడిపోతున్నాయి. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు (పీసీబీ) అధికారులు చోద్యం చూస్తున్నారు.

నిబంధనలు గాలికి..

చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, చిట్యాల, బీబీనగర్ మండలాల పరిధిలో రసాయన పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఉత్పత్తులు తయారు చేసే క్రమంలో వెలువడే వ్యర్థ రసాయనాలను పరిశ్రమలోని ఈటీపీ ప్లాంట్ ద్వారా శుద్ధిచేయాలి. లేదా హానికరమైన కంపెనీలను హైదరాబాద్‌లోని జీడీమెట్ల, పటాన్‌చెరువు ప్రాంతాల్లోని ఎంఈఈ ప్లాంట్లకు తరలించాలి. కానీ, పరిశ్రమల యజమాన్యాలు అవేమీ పట్టించుకోకుండా ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి.

నిద్రించే సమయంలో సాగుతున్న దందా

అర్ధరాత్రి సమయంలో పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలను ట్యాంకర్ల ద్వారా తీసుకువచ్చి జాతీయ రహదారి పక్కన పారబోస్తున్నారు. గతంలో మూసీ నదిలో వదిలేవారు. దూరం వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని.. కాబట్టి సమీపంలోని జాతీయ రహదారి పక్కన వదులుతున్నారు. పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో కెమికల్ మాఫియాకు కలిసొస్తుంది. చౌటుప్పల్ మండలంలోని తుప్రాన్‌పేట, దండుమల్కాపురం, బొర్రోళ్లగూడెం, ధర్మోజిగూడెం, అంకిరెడ్డిగూడెం స్టేజీ సమీపంలో, పంతంగి టోల్‌ప్లాజా దాటగానే రోడ్డు పక్కనే ట్యాంకర్లను పార్కింగ్‌కు నిలిపినట్లు నిలిపి వ్యర్థ రసాయనాలను వదులుతున్నారు. ట్యాంకర్ ముందు ఎస్కార్ట్‌గా కార్లను పెట్టుకుని అక్రమార్కులు వ్యర్థ రసాయనాల దందా నడుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వ్యర్థ రసాయనాల ఘాటుతో..

వ్యర్థ రసాయనాలను రోడ్డు పక్కన వదలడం వల్ల గాడతకు హరితహారంలో నాటిన చెట్లు ఎండిపోతున్నాయి. రోడ్డు పక్కన వర్షపు నీరు పోవడానికి తీసిన కాల్వలోకి రసాయనాలు వెళ్లి భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. విపరీతమైన దుర్గంధం వస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. పీసీబీ అధికారులు, పోలీసులు స్పందించి కెమికల్ మాఫియా నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిఘా పెంచుతాం



బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థ రసాయనాలు పారబోస్తే కేసులు తప్పవు. గతంలో పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేశాం. జాతీయ రహదారిపై పోలీస్ నిఘా కొనసాగుతుంది. రాత్రి సమయంలో నిఘా పెంచుతాం. రసాయనాలు పారబోస్తూ వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

–ఆశోక్‌రెడ్డి, చౌటుప్పల్ సీఐ

వాసన భరించలేకపోతున్నాం



జాతీయ రహదారి పక్కన వ్యర్థ రసాయనాలను పారబోయడం వల్ల తీవ్రమైన దుర్వాసన వస్తుంది. అక్కడి నుంచి ప్రయాణం చేయలేకపోతున్నాం. రాత్రి పూట ట్యాంకర్లలో తీసుకువచ్చి పోస్తున్నట్టుంది. అధికారులు స్పందించి వ్యర్థ రసాయనాలు పారబోస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కెమికల్ మాఫియాను అరికట్టాలి.

–వర్కాల బాలకృష్ణ, తుప్రాన్‌పేట

• రాఖీ వేళ.. ఆనందహేళ



చౌటుప్పల్ పట్టణంలోని బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి రాఖీలు కట్టి నవ్వులు చిందిస్తున్న విద్యార్థినులు

ఒక్క చిత్రం వేల స్మృతులతో సమానం

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరిటౌన్ : ఒక్క చిత్రం వేల స్మృతులతో సమానం అని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేక్ కట్ చేసి ఫొటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జీవితంలో జరిగే ఘటనలు కొన్నింటిని మాత్రమే కళ్లతో చూడగలుగుతామని, కానీ ఎటువంటి క్షణాలనైనా బంధించగలిగేది కెమెరా మాత్రమేనన్నారు. ఫొటో జర్నలిస్టులు తమ నైపుణ్యం ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంధమల్ల రాజు, ఉపాధ్యక్షులు కృపానగర ఫణీందర్, గుజ్జ నరేష్, ప్రధాన కార్యదర్శి కొల్లోజు శివకుమార్, కోశాధికారి మొగిలిపాక కనుక రాజు, సహాయ కార్యదర్శి జాకీర్, ప్రచార కార్యదర్శి కర్రె గణేష్, సభ్యులు దేశ్ పాండ్ నరసింహ, కృపానగరం అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

ప్రజావాణికి నాలుగే వినతులు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం బోసిబోయింది. రాఖీ పండుగకు సెలవుగా భావించి ఎవ్వరూ రాలేదు. కేవలం నలుగురు మాత్రం వచ్చి తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. అధికారులు సైతం చాలామంది హాజరుకాకపోవడంతో సమావేశ మందిరం వెలవెలబోయింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పార్థసింహారెడ్డి బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆ తరువాత కొద్దిసేపు వేచిచూసి ఎవ్వరూ రాకపోవడంతో వారి సబార్డినేట్లను కూర్చోబెట్టి వెళ్లిపోయారు. కాగా సోమవారం సెలవు లేదని అధికారులు ప్రకటన విడుదల చేయాల్సి ఉన్నా విస్మరించారు.



ప్రజావాణికి హాజరైన అర్జీదారులు

మందులు అందుబాటులో ఉంచండి

- అదనపు కలెక్టర్ గంగాధర్
- రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



రోగుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ గంగాధర్

రామన్నపేట : సీజనల్ వ్యాధులకు సంబంధించి ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ ఆదేశించారు. సోమవారం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడారు. వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలు, డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మందుల స్టాక్, పేషెంట్ల నమోదు రికార్డులు, వైద్యుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందుబాటులో లేని అత్యవసరమైన మందులను తక్షణమే కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. విధిగా సమయపాలన పాటించాలని, రోగుల సమస్యలను సావధానంగా విని, ఆప్యాయంగా పలుకరిస్తూ సరైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వార్డులను, పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డాక్టర్ల కొరత, భవనాల శిథిల స్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఆస్పత్రిలో ఈనెల 6న కొల్లు మానస మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వీరన్న, వైద్యులు ఈశ్వర్, నాగేశ్వర్‌రావు, వరుణ్‌రెడ్డి, లింగాయాదవ్, మాధవాచారి ఉన్నారు.

అవినీతి ఉద్యోగులపై కొరడా

- 'సాక్షి' కథనానికి స్పందించిన కలెక్టర్
- కోదాడ తహసీల్దార్ బదిలీ, ఆర్‌ఐ సస్పెన్షన్

కోదాడ: రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కోదాడ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్‌ను బదిలీ చేయడంతోపాటు ఆర్‌ఐని సస్పెండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారసత్వ భూమి భాగ పంపిణీ కోసం ఓ రైతు కుటుంబం నుంచి కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో రూ.1.50లక్షలను కిందిస్థాయి సిబ్బంది ద్వారా వసూలు చేయడంపై.. 'లక్షల్లో వసూలు చేశారు' అనే శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. స్థానిక ఆర్డీఓతో విచారణ చేయించారు. తహసీల్దార్ సాయిరాం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.సుజాతపై రైతుల నుంచి పలు ఆరోపణలు వాస్తవమని తేలింది. దీంతో తహసీల్దార్ ను బదిలీ చేయడమే గాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

సీనియర్ అసిస్టెంట్..

సూర్యాపేట కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న నాగారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షఫీపై రైతుల నుంచి పలు ఆరోపణలు రావడంతో విచారణ చేసి కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

• వైభవంగా బోనాలు



వెల్లంకిలో బోనాలతో ఊరేగింపుగా భద్రావతీదేవి ఆలయానికి వెళ్తున్న పద్మశాలీ మహిళలు

17 ఏళ్లుగా 'పొరుగు' సేవల్లోనే!

క్రమబద్ధీకరణకు నోచుకోని ఆరోగ్యమిత్రలు

- చాలీచాలని వేతనాలతో జీవనం
- ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన
- 21 నుంచి సమ్మె బాట.. ఇప్పటికే ఆరోగ్య ట్రస్టు సీఈఓకు నోటీస్ అందజేత



ఆరోగ్య ట్రస్టు సీఈఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న ఆరోగ్య మిత్రలు (ఫైల్)

భువనగిరి : రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఆరోగ్యమిత్రల పరిస్థితి దయనీయంగా మారింది. 17 సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా ప్రభుత్వాలు వారిని పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినా స్పందనలేకపోవడంతో ఈనెల 21నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈఓ, సచివాలయ ఉన్నతాధికారులకు ఇప్పటికే సమ్మె నోటీసు అందజేశారు.

ఉమ్మడి జిల్లాలో 81 మంది..

రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 81 మంది ఆరోగ్యమిత్రలు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇందులో నల్లగొండలో 44, సూర్యాపేటలో 20, యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మంది ఉన్నారు. వీరంతా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు.ఆస్పత్రిలో రోగి అడ్మిషన్ మొదలుకుని డిశ్చార్జ్ వరకు వైద్య సేవలపరంగా ఆరోగ్యమిత్రలమే కీలకంగా వ్యవహరిస్తారు. వీరు సమ్మెకు దిగితే రోగులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి.

డిమాండ్లు ఇవీ..

- ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి.
- డీపీఓ క్యాడర్ కల్పించాలి.
- జీఓ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలి
- విధుల్లో ఉన్నప్పుడు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం అందజేయాలి. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి.
- హెల్త్‌కార్డులు ఇవ్వాలి. షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలి.

నేటి వరకు గడువు ఇచ్చాం



రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో సుమారు 17 సంవత్సరాలుగా పని చేస్తున్నాం. చాలీచాలని వేతనాలు, ఉద్యోగభద్రత లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. తమ సమస్యలు పరిష్కరించాలని గతంలో అనేకసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదు. 20వ తేదీలోగా డిమాండ్లు నెరవేరాల్చలని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓకు సమ్మె నోటీసు అందజేశాం. ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మెకు వెళ్తాం.

–మీసాల మహేష్, ఆరోగ్యమిత్రల జిల్లా అధ్యక్షుడు

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



గొంగిడి సునీత

సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తి కావస్తున్నా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తప్పా.. మరే ఇతర హామీ అమలు చేయలేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు ఇస్తానన్న రూ.2,500 కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. స్కూటీలకు విద్యార్థులు, పింఛన్ కోసం ఒంటరి మహిళలు, వితంతువులకు నిరీక్షణ తప్పడం లేదన్నారు. అన్నా అని పిలిపించుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని కోరారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని, హోంశాఖ మంత్రిగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు సునీత పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కొలువులపై ఆశలు

- టీచర్లు 64, ఆయాల పోస్టులు 264 ఖాళీలు గుర్తింపు
- మార్గదర్శకాలు రాగానే భర్తీ
- మెరుగుపడనున్న సేవలు



భువనగిరి : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి మోక్షం లభించింది. ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చిన్నారులకు పూర్వ, ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది.

901 కేంద్రాలు

భువనగిరి, రామన్నపేట, ఆలేరు, మోత్కూర్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 901 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో చిన్నారులు 36,084, గర్భిణులు 5,024, బాలింతలు 4,392 మంది ఉన్నారు.

ఖాళీలు ఇలా..

నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 328 ఖాళీలున్నాయి. వీటిలో టీచర్లు 64, ఆయా పోస్టులు 243 ఉన్నాయి. వీటితో పాటు విధి నిర్వహణలో ఉండి మృతిచెందిన వారు, రాజీనామా చేసినవారు, టీచర్లు సూపర్‌వైజర్లుగా పదోన్నతి పొందడంతో ఖాళీలు ఏర్పడ్డాయి.

త్వరలోనే భర్తీ చేస్తాం

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను గుర్తించాం. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. ఉన్నతస్థాయి మార్గదర్శకాల ప్రకారం పోస్టులను భర్తీ చేస్తాం. త్వరలోనే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఖాళీలను భర్తీ చేయడం ద్వారా లబ్ధిదారులకు సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

–కృష్ణవేణి, స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

రాజాపేట: విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలైన ఘటన రాజాపేట మండల పరిధిలోని బంటుగూడెంలో సోమవారం జరిగింది. బంటుగూడెం గ్రామానికి చెందిన కర్రె లక్ష్మి, పాండవుల శారద తమ ఇళ్ల ముందు దండెంపై బట్టలు ఆరేస్తుండగా.. దండేనికి విద్యుత్ సరఫరా కావడంతో వారిద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. పక్కనే ఉన్న వ్యక్తి గమనించి కర్ర సహాయంతో తీగను తప్పించడంతో వారు కిందపడిపోయారు. లక్ష్మి, శారదకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

త్రిపురారం: చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన త్రిపురారం మండలం అప్పలయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సీత్య తండాలో జరిగింది. సోమవారం ఎస్ఐ వీరశేఖర తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి గ్రామానికి చెందిన ముడావత్ బాలు(43) గత 20 ఏళ్లుగా మద్యానికి బానిసై పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఆదివారం త్రిపురారం మండలం అప్పలయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సీత్యాతండాలో గల ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు ఆలయంలో ఉండగా.. రాత్రి 10 గంటలకు బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య ముడావత్ తరి ఆలయం బయటకు వెళ్లి వెతకగా.. గుడికి సమీపంలో చెట్టుకు తన లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

నేరేడుచర్ల : దొంగతనం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన అంతని గోపి అనంతగిరి మండలం శాంతినగర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2023 సెప్టెంబర్ 15న మేడారం గ్రామంలో నెమలితోక సొడమ్మ తన ఇంట్లో నిద్రిస్తుండగా ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలతాడును గోపి దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అదే రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా 2022 మే 5వ తేదీన చిలుకూరు మండలం పోలేనిగూడెంలో ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారపు గొలుసును కూడా గోపి దొంగిలించాడు. తాను చోరీ చేసిన సొత్తును సోమవారం నేరేడుచర్లలో అమ్మేందుకు గోపి వెళ్తుండగా.. పోలీసులు పట్టుకుని అతడి వద్ద నుంచి రెండు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గోపిపై మునగాల, సూర్యాపేట, చివ్వెంల, మోతె, నడిగూడెం, చిలుకూరు, నేరేడుచర్ల పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, శ్రీస్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి



రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి హితాశ్రీ



రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరీమణి



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



'రాఖీ కట్టేందుకు ఆడపిల్లను కాపాడుకుందాం' అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మిర్యాలగూడ మండలం అవంతీపురం గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి తన క్యాంపు కార్యాలయంలో రాఖీ కడుతున్న మహిళలు



సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్



భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులతో కిటకిటలాడుతున్న కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్



నల్లగొండ నుంచి బస్సులో నిలబడి ప్రయాణిస్తున్న మహిళలు



నల్లగొండ బస్టాండ్‌లో టికెట్ కౌంటర్ వద్ద భారీ క్యూ



మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కట్టి యాదాద్రి ప్రసాదం తినిపిస్తున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

సాగర్ ఎడమ కాల్వలో బాలిక గల్లంతు

వేములపల్లి: సాగర్ ఎడమ కాల్వలో బాలిక గల్లంతైంది. ఈ ఘటన సోమవారం వేములపల్లి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కుసుమవారిగూడెం గ్రామానికి చెందిన పోతురాజు విజయలక్ష్మి, సైదులు దంపతులకు కుమార్తె తేజశ్రీ (14), కుమారుడు గోపిచంద్ సంతానం. విజయలక్ష్మి తమ్ముడు కోదాడి పరుశురాములు వివాహానికి ఆరు రోజుల క్రితం కుటుంబ సభ్యులంతా కలిసి వేములపల్లి మండలం బుగ్గబావిగూడేనికి వచ్చారు. ఆదివారం వివాహం అయిపోగా సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎల్–14 వద్ద గల బట్టలు ఉతికేందుకు విజయలక్ష్మి, కుమార్తె తేజశ్రీ, కుమారుడు గోపిచంద్‌తో పాటు మరికొందరు బంధువులతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో తేజశ్రీ ఒక్కసారిగా కాలు జారి కాల్వలో పడిపోగా ప్రవాహానికి కొట్టుకుని పోయింది. తేజశ్రీని కాపాడేందుకు పలువురు ప్రయత్నించగా ప్రవాహ వేగానికి గల్లంతైంది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని తేజశ్రీ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తేజశ్రీ పెన్‌పహాడ్ కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



తేజశ్రీ

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం

- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

కోదాడ: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద సోమవారం తెల్లవారుజామున రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన గుడుగుంట్ల రామకృష్ణ (48) మందులు కొనుగోలు చేసేందుకు సోమవారం తెల్లవారుజామున బైక్‌పై ఇంట్లో నుంచి బయటకు వెళ్లగా.. కూరగాయల మార్కెట్ వద్ద మరో బైక్‌పై ముగ్గురు యువకులు అతివేగంగా వచ్చి రామకృష్ణ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా.. అందులో ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడిని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన బైక్.. యువకుడు మృతి

చిట్యాల: బైక్‌పై వెళ్తున్న యువకుడు చెట్టును ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల మండలం పేరేపల్లి గ్రామ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ జానారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పేరేపల్లి గ్రామానికి చెందిన రూపని రాజశేఖర్(31) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బైక్‌పై వెలిమినేడు గ్రామానికి వెళ్లి రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. పేరేపల్లి గ్రామ పరిధిలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం మృతుడి తమ్ముడు రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి పాల ట్యాంకర్ బోల్తా

పెద్దవూర: మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న పాల ట్యాంకర్ ఆదివారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై బోల్తా పడింది. పెద్దవూర మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా.. ప్రధాన రహదారికి డైవర్షన్ ఏర్పాటు చేసి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అతివేగంగా వస్తున్న పాల ట్యాంకర్ డ్రైవర్ దగ్గరికి వరకు వచ్చాక రోడ్డు డైవర్షన్‌ను గమనించి వాహనాన్ని ఒక్కసారిగి పక్కకు తిప్పడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గాలిపంపును, మోటార్లను, డివైడర్లకు అమర్చిన ఇనుప గ్రిల్స్‌తో పాటు పక్కనే 33/11 కేవీ విద్యుత్ స్తంభాన్ని తాకుతూ వెళ్లి బోల్తాపడింది. దీంతో చాసిస్ నుంచి ట్యాంకర్ ఊడిపోయి సగానికి పైగా పాలు రోడ్డుపాలయ్యాయి. ఉదయం వేరే ట్యాంకర్‌ను తీసుకొచ్చి ట్యాంకర్‌లో మిగిలిన పాలను తీసుకెళ్లారు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.



చాసిస్ నుంచి విడిపోయిన ట్యాంకర్

దొడ్డా నారాయణరావు సతీమణి మృతి

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి స్వాతంత్ర్య సమర యోధుడు దొడ్డా నారాయణరావు సతీమణి, సీపీఐ సీనియర్ నాయకురాలు సక్కుబాయి(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావెళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, ఉజ్జిని రత్నాకర్, గన్నా చంద్రశేఖర్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పార్టీ కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, నెల్లికంటి సత్యం, ప్రముఖ వైద్యుడు సుబ్బారావు, కాంగ్రెస్ నాయకుడు చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, వివిధ పార్టీ నాయకులు సక్కుబాయి భౌతికకాయానికి నివాళులర్పించారు.



సక్కుబాయి (ఫైల్)

అనారోగ్యంతో బాధపడుతూ రైతు బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగి రైతు బలవర్మణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం ఉదయం భూదాన్ పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారాల వెంకట్‌రెడ్డి (57)కి భార్య పద్మ, ఇద్దరు వివాహితులైన కుమారులు ఉన్నారు. వెంకట్‌రెడ్డి గ్రామంలో వ్యవసాయం చేస్తుండగా.. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వెంకట్‌రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర ఆందోళనలో ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున నిద్రలేచి ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ 4జీ గుళికలను నీటిలో కలుపుకొని తాగాడు. తెల్లవారుజామున బావి వద్దకు వెళ్లిన భర్త ఉదయం 9 గంటలైనా రాకపోయేసరికి ఆందోళనతో భార్య పద్మ అతని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయదు. దీంతో వారి బావి సమీపంలో ఉన్న రైతుకు ఫోన్‌చేసి విషయం చెప్పగా.. ఆయన వెళ్లి చూడగా వెంకట్‌రెడ్డి మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. మంచం పక్కనే గుళికల ప్యాకెట్, నీళ్లు ఉండటాన్ని గమనించిన సదరు రైతు వెంటనే వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



వెంకట్‌రెడ్డి (ఫైల్)

డబ్బుతో మాయమై.. శవమై కనిపించాడు

- నెల్లికల్లు అటవీ ప్రాంతంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


నాగార్జునసాగర్, మిర్యాలగూడ అర్బన్: ఏటీఎంల్లో డిపాజిట్ చేయాల్సిన డబ్బు తీసుకుని కనిపించకుండా పోయిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగార్జునసాగర్ నియోజవర్గ పరిధిలోని నెల్లికల్లు అటవీ ప్రాంతంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. నాగార్జునసాగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన పడగాల సుధాకర్ (38) కుటుంబంతో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. మిర్యాలగూడలోనే ఏటీఎంల్లో మనీ డిపాజిట్ చేసే హిటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో క్యాష్ డిపాజిటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సుధాకర్ ఏటీఎంల్లో డిపాజిట్ చేయాల్సిన రూ.20లక్షలను క్యాష్ డిపాజిట్ చేయకుండా కనిపించకుండా పోయాడు. దీంతో సుధాకర్‌పై సదరు కంపెనీ నిర్వాహకులు ఈ నెల 13వ తేదీన మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. కాగా నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికల్లు అటవీ ప్రాంతంలో సుధాకర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం పశువుల కాపరి గమనించి నాగార్జునసాగర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య రత్నకుమారి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



సుధాకర్ (ఫైల్)

చెన్నకేశవస్వామి ఆలయంలో చోరీ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఆలయానికి తాళం వేసి వెళ్లిన అర్చకులు సోమవారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా చెన్నకేశ్వరస్వామి వెండి కన్ను ఒకటి, నాలుగు చీరలు, వన్ గ్రాం గోల్డ్ వడ్డాణం, హుండీలో ఉన్న సుమారు రూ.15వేలు కనిపించలేదు. దీంతో ఆలయ ప్రధాన అర్చకుడు మనీష్ గౌతమ్ మిర్యాలగూగ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అదేవిధంగా పక్కనే ఉన్న శివాలయంలో కూడా దుండగులు చోరీకి యత్నించారు. రెండు నెలల క్రితం ఇదే ఆలయంలో దుండగులు 22 కేజీల ఇత్తడి గంట ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.



స్వామివారి వెండి కన్ను ఎత్తుకెళ్లిన దుండగులు

ఈదురుగాలులకు కుప్పకూలిన కోళ్ల షెడ్డు

- ఐదువేల కోడిపిల్లలు మృతి
- యజమానికి తీవ్ర గాయాలు

గుర్రంపోడు: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పిట్టలగూడెం గ్రామంలో రామసాని నరేందర్‌రెడ్డికి చెందిన కోళ్ల షెడ్డు కుప్పకూలింది. ఆ సమయంలో షెడ్డులోనే ఉన్న నరేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే మరో షెడ్డులో ఉన్న అతడి కుటుంబ సభ్యులు గ్రామస్తులకు సమాచారం అందించగా.. వారు వచ్చి శిథిలాల నుంచి నరేందర్‌రెడ్డిని బయటకు తీసుకొచ్చారు. ఆయనను హుటాహుటిన నల్లగొండలోని ఆస్పత్రికి తరలించారు. షెడ్డు కుప్పకూలడంతో ఐదు వేల కోడిపిల్లలు మృతి చెందినట్లు భావిస్తున్నారు. అదేవిధంగా పిట్టలగూడెం, కొప్పోలు, గుర్రంపోడు, చామలోనిబావి, వట్టికోడు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో పాటు ఈదురుగాలులకు రోడ్లపై చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఊడిపోయిన బస్సు గేర్ రాడ్డు

చండూరు: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు గేర్ రాడ్డు ఒక్కసారిగా ఊడిపోయింది. సోమవారం మాల్ నుంచి నల్లగొండకు వస్తున్న ఆర్టీసీ బస్సు చండూరు మున్సిపల్ కేంద్రానికి చేరుకోగానే డ్రైవర్ గేర్ వేసేందుకు ప్రయత్నించగా గేర్ రాడ్డు చేతికి ఊడి వచ్చింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం ప్రయాణికులు మరో బస్సులో ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.



చండూరులో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు